# మనసున మనసై

**— కృష్ణప్రియ**

ప్రియమైన మీకు,

ఏం చేస్తున్నారు? చల్లని సాయంత్రం వేడిగా కాఫీ తాగుతూ కబుర్లు చెప్పటం మీకిష్టమైన పనుల్లో ఒకటి కదా! ఎవరితో చెబుతున్నారేం కబుర్లు? ఇక్కడ చూడండి-యిక్కడ ఆకాశం ఎంత నీలంగా, స్వచ్ఛంగా ఆనందంగా వుందో? గాలి కూడా సాయంత్రం కాగానే అప్పుడే స్నానించి వచ్చినట్టు హాయిగా, పల్చని చీర కట్టుకుని వస్తుందేమో! ఇప్పుడు వైజాగ్‌లోను అలాగే వీస్తోంది గాలి. అది ఇక్కడి గాలే మహాశయా! నా ప్రేమ పరిమళాన్ని మోసుకుని అటుగా వచ్చింది. కొంచెంగా చీకటి పడుతోంది. సంధ్య ఇంకొంచెం ముదిరాక ఆకాశం కొద్దిగా బద్ధకం వదిలి లేచి చెమ్కీ చుక్కల నల్లచీర కట్టుకుని చందమామని సిగలో తురుముకుని రేరాణిలా ముస్తాబవుతోంది. ఈ డాబామీద చాపేసుకుని వెల్లకిలా పడుకుని ఈ వెన్నెల్లోని ఆనందాన్ని అనుభవించడం, ఈ పిట్టగోడదాకా అల్లుకుని వొత్తుగా పూసిన విరజాజుల పరిమళాన్ని గుండె నిండా ఆస్వాదించడం హాయిగానే వుంది. కానీ ఇంత హాయిలోనూ చిన్న లోటు. మీ సమక్షం లేకపోవడం.

ఎంత ఆనందకరమైన సమయాల్లోనైనా లోటు కనపడిందంటే అది మనసైన మనిషి దగ్గర లేకపోవడమేకదూ! నాకు నీమీద ప్రేమ ఎక్కువైపోతుందోయ్. ఏకవచనంలో మాట్లాడేస్తాను కాసేపు.

ఇలాంటి సాయంత్రాలు నువ్వుంటే ఎంత హాయిగా తొందరగా గడిచిపోతాయో. నువ్వు లేకపోతే అంత నిరాసక్తంగా, డ్రాగింగ్‌గా ఏడ్చినట్లుంటాయి. నిజం! నువ్వుంటే చీకట్లో కూడా వెన్నెల్ని వెతుక్కోగలను! చూడు-నువ్వు లేకపోతే ఈ పాల వెన్నెలే కటిక చీకట్లో కల్సిపోయినట్టుంది. ఏమిటిది. ఏమీలేదు. నిన్నమొన్న అవడం. అయామ్ రియల్లీ మిస్సింగ్ యూ డియర్!

అసలింకో విషయం చెప్పనా!

నీకంటే నీ తలపుల్నే ఎక్కువగా ప్రేమిస్తున్నాన్నేను! ఏమో నాకలాగే అనిపిస్తోంది బాబూ! నువ్వు నాదగ్గర వున్నప్పటి కంటే, యింకెక్కడికైనా వెళ్లినపుడు యింకా దగ్గరౌతావు! నీకు వీడ్కోలు యిచ్చినప్పటి నుండి తిరిగి నువ్వు నాకళ్లముందు నిలబడే దాకా ప్రతిక్షణం, ప్రతి ఉచ్ఛ్వాస నిశ్వాసంలోను నువ్వే కనపడుతూ అల్లరి పెడుతూ నా కొంగు పట్టుకుని తిరుగుతుంటావు! అక్కడ ఈపాటికి నువ్వేం చేస్తుంటావో-స్నానం చేస్తున్నావా. నేనసలు గుర్తొస్తానా! లంచ్ చేస్తున్నావా. ఈపాటికి వెళ్లిన పని అయిపోయి వుంటుందా! తిరిగి రైల్వే స్టేషన్‌లోనో లేదా రైల్లోనో వుంటారేమో! హిగ్గిన్ బాథమ్స్‌లో నాకోసం ఏవైనా కొత్త బుక్స్ కొన్నారేమో. నువ్వు వచ్చేటప్పటికి ఏం చేస్తూ కనపడాలి? ఏ చీరె కట్టుకోవాలి? నీకిష్టమైన కాసెట్ పెట్టి వుంచితే! అబ్బా-ఏవో ఆలోచనలు! అన్నీ నీ గురించే. నువ్వు లేకపోతే ఇల్లెలా వున్నాసరే నాకనవసరం. ఇవాళ వాజ్‌లో పూలు కూడా మార్చలేదు.

ఏమిటింతగా నీతో అటాచ్‌మెంట్ నాకు! అసలు ఎవరోయ్ నువ్వు? నా మనసుని యింతగా నీ కంట్రోల్‌లో పెట్టేసుకున్నావు!

నిన్న ఏమైందో చెప్పనా! 'పిచ్చి' అని నవ్వకూడదు మరి! మధ్యాహ్నం పూట ఎలాగో నిద్ర పట్టింది. అందమైన కలలో అందంగా నువ్వు! కలలో ఏం జరిగిందో గుర్తులేదు! లేచాక మీ ఆఫీస్‌కి ఫోన్ చేశాను! నువ్వసలు ఊరెళ్లావని గుర్తే లేదు. మీ సెక్షన్‌లో వుంటుందే విజయ-ఆవిడ తీసింది ఫోను. 'ఉన్నాడా మీ అన్నయ్య' అని అడిగితే, 'అదేంటి, ఊర్నించి ఎప్పుడొచ్చాడని' అంది. దాంతో నాకు తెలివొచ్చింది. కొంచెం సిగ్గుకూడా వేసింది. ''అవును రాలేదు కదా'' అని కంగారు కంగారుగా ఫోన్ పెట్టేశాను. ఛ..విజయ నవ్వుకుందేమో కదూ! అసలు బుద్ధుందా అంట. నాకల్లోకి ఎవర్రమ్మన్నారు. మొహం చూడు-ఎంత ఇన్నోసెంట్‌గా పెట్టేస్తావో!

ఇలా చూడండి. ఎన్నిరోజులైంది మన పరిచయమై? ఇన్నిరోజుల్లో నా ప్రేమ ఎప్పుడైనా మారిందా? లేదు కదూ! నీ గురించి, నామీద నీ ప్రేమ గురించి నాకేం సందేహం లేదు. టైమెంతయింది. ఎనిమిదా! అన్నం తిన్నారా? రాత్రిపూట ఈపాటికల్లా తినెయ్యడం అలవాటు కదూ! నాకు ఆకలిగా లేదు. నిజం ఆకలంటే గుర్తొచ్చింది.

మీకో సంగతి గుర్తుందా! నన్ను చాలా బాధపెట్టిన సంగతి. నన్ను నీకు బోల్డంత దగ్గర చేసిన సంగతి.

మన పరిచయమైన కొత్తలో ఒకసారి లంచ్ టైమ్‌లో మా ఆఫీసుకి ఫోన్ చేసి ''లంచ్ అయిందా మేడమ్'' అని అడిగారు. ఆరోజు నిజంగానే నేను లంచ్ తీసుకురాలేదు. పైగా పని ఎక్కువగా వుంది. ఆరోజు కంప్లయింట్స్ ఎక్కువగా వున్నాయి. ఫోన్ కాల్స్ ఎంజాయ్ చేసే పరిస్థితిలో లేను.

''లేదు యివాళ లంచ్ చెయ్యను. తేలేదు కూడా'' చెప్పాను.

''మరి ఆకలెయ్యదా! సాయంత్రం దాకా ఎలా వుంటారు'' తమరు ఫ్రీగా వున్నట్టున్నారు బాతాఖానీలోకి దిగారు. నాకు విసుగేసింది. అవతల మరో ఫోన్ మోగుతోంది.

''ఇవ్వాళ నీర్సం వచ్చినాసరే తినను. సరేనా-చాలా పనుంది పెట్టెయ్యండి'' కొంచెం కఠినంగానే చెప్పాన నుకుంటాను.

''సరే ఇవాళ నేను లంచ్ చెయ్యను. మీరు తిన్నారని తెలిసేదాకా నేను తినను'' ధృడంగా నెమ్మదిగా చెప్పి ఫోన్ పెట్టేశారు మీరు.

నేను మామూలుగా పన్లో నిమగ్నమైపోయాను. ఎవరో లంచ్‌ప్యాక్ తెచ్చారు హోటల్ నుండి. తినేశాను అందరితో కల్సి.

మర్నాడు మధ్యాహ్నం కొంచెం ఖాళీ దొరికినప్పుడు నిన్న మీతో కొంచెం 'రాష్'గా మాట్లాడాననిపించి ఫోన్ చేశాను, మీ ఆఫీస్‌కి! మీ రూమ్మేట్ సుబ్బారావు చెప్పాడు మీరు ఆఫీస్‌కి రాలేదనీ, జ్వరమనీ.

''జ్వరమా ఎప్పటినుండీ. నిన్న మాట్లాడారే బాగానే'' ఆశ్చర్యంగా అన్నాను.

''నిన్న మధ్యాహ్నం ఆకల్లేదని తిండి తిన్లేదు గాడిద. సాయంత్రానికల్లా తలనొప్పి నీర్సం. దాంతో యిక రాత్రి కూడా తిన్లేదు. జ్వరం వచ్చింది. రూమ్‌లోనే పడుకున్నాడు'' చెప్పారు.



నాకప్పుడు గుర్తొచ్చాయి ఫోన్లో నీ మాటలు! అప్పుడు తెలిసింది కూడా-తమరు నన్ను ప్రేమించేస్తున్నారని. ఆ సాయంత్రం ఆఫీసు నుండి మీ రూమ్‌కి వచ్చాను గుర్తుందా! నా చేతిమీద నువ్వు- ఆరోజు-వొద్దులే! ఇప్పుడు అర్జెంటుగా నిన్ను చూడాలనిపిస్తుంది.

ఇప్పుడు మీరేం చేస్తున్నారో చెప్పనా! హాయిగా భోంచేసి తన్మయి కూతురితో కబుర్లు చెపుతూ వుంటారు. లేక సాగర్‌తో చెస్ ఆడుతూ వుంటారు. నీ తలపులు వదిలేలా లేవు నన్ను. కవిగారన్నట్టు 'వలపు కన్నా తలపే తీయన' లాగుంది కదూ!

ఎవరో రచయిత అన్నట్లు నేను ప్రేమిస్తున్నానో, నిన్ను ప్రేమిస్తున్నానన్న భావనని ప్రేమిస్తున్నానో నాకర్థం కావటం లేదు.

ఎనివే
యింకోసారి చెపుతున్నా-ఐ లవ్ యూ!

నేను మొదటిసారి నీతో 'ఐ లవ్ యూ' అని ఎప్పుడు చెప్పానో నీకు గుర్తుందా!

ఆరోజు మనం యూనివర్శిటీ రోడ్డులో నడిచి వస్తున్నాము. నీతో మాట్లాడుతూ నేను చూసుకోకుండా చిన్న గోతిలో కాలు వేశాను. కాల్లో గాజు పెంకు లాంటి పదునైన వస్తువు ఏదో గుచ్చుకోవడంతో నిలదొక్కుకోలేక తూలి ముందుకు పడబోయి-ఎలాగో తమాయించుకుని చతికిలపడిపోయాను.

నువ్వు కెవ్వున అరచి అక్కడి ఆ రోడ్డుమీద కూర్చుని నా పాదాన్ని నీ వళ్లో పెట్టుకుని స్రవిస్తున్న రక్తాన్ని నీ షర్ట్‌తో తుడిచావు. ''పిచ్చి-చూసుకోనక్కర్లా'' అని తిట్టావు కూడా! నా బాధ కంటే నీ బాధ ఎక్కువైంది.

ఆటోని పిలుస్తూనే వాడు వస్తున్నాడో లేదో చూసుకోకుండా ఎత్తుకుని తీస్కెళ్లడానికి సిద్ధమైపోయావు. ఈలోగా చుట్టూ చేరి ఏం జరిగిందోనని తెలుసుకుంటున్న స్టూడెంట్స్‌నీ వాళ్లనీ నువ్వు

## కారణం తెలియదట!



ఇంద్రజ మెల్లమెల్లగా తెరమరుగైపోతోంది. ఈ విషయమే ఆమెను కదిలించి ''ఇలా ఎందుకు జరుగుతోంది?'' అంటే ''నాకదే అర్థం కావడంలేదు. మొదట్లో దర్శక నిర్మాతలు నాకు మంచి అవకాశాలే ఇచ్చారు. ఒకానొకప్పుడు టాప్ పొజిషన్‌కి దగ్గరయ్యాను. ఇంతలో ఏమయిందో తెలియదు, అవకాశాలన్నీ ఒక్కసారిగా దూరమైపోయాయి'' అంటూ వాపోయింది. ''నిజంగానే మీకు అవకాశాలు దూరం కావడానికి కారణం తెలియదా?'' అంటే ''నిజంగానే తెలియదు'' అంది ఇంద్రజ. ఆమెకు తన లోపం తెలుసో, తెలియదోగానీ ఇండస్ట్రీజనం అనుకోవడం మాత్రం 'ఆ మధ్య ఇంద్రజ హఠాత్తుగా తన ప్రవర్తనను మార్చుకుందనీ, కోపరేట్ చేయడం మానేసిందనీ!' మరీ క్రేజ్ ఉన్న ఆర్టిస్ట్‌లయితే తప్ప 'కోపరేట్' చేయని ఆర్టిస్ట్‌కి దర్శక నిర్మాతలు ఎందుకు అవకాశం ఇస్తారు?!... అర్థం చేసుకో ఇంద్రజా!

- జె.వి. బాబు

చూడనేలేదు. నీ కంగారు చూసి నిజంగా నా గాయం బాధ నాకు తెలియనేలేదు. నీ కర్చీఫ్‌తో నా కాలికి కట్టిన కట్టువైపు చూశాను. నీ రుమాలు బదులు నీ మనసే కనబడింది. అందుకే- అంత జనం ముందు ''ఐ లవ్ యూ'' అని మనస్ఫూర్తిగా నీ కళ్లలోకి చూస్తూ చెప్పాను.

నిజం నువ్వు తప్ప జీవితంలో అంత ప్రేమని నాకెవరు యివ్వగలరు? ఆరోజే ట్రబుల్ యిచ్చిన నీ స్కూటర్ మీద నీకెంత కోపం వొచ్చిందో యిప్పటికీ నాకు గుర్తుంది.


నీతో కలిసి జీవించాలనే కాంక్షతో- అందర్నీ కాదనుకున్నాను. అందుకు ఏనాడూ నేను పశ్చాత్తాప పడకుండా నిండుప్రేమతో నా జీవితాన్ని పునీతం చేశావు నువ్వు. ఇంకేం కావాలి నాకు?

ఈ జీవితానికి చాలు. పాత సినిమాల్లో పతివ్రతలు 'మీ పాదాల దగ్గర నాకింత చోటివ్వండి' అని అడుగుతుంటార్లే! నేను పతివ్రతనో కాదో నాకు తెలియదు కానీ నాకు మాత్రం నీ గుండెలో కాసింత చోటు చాలు! కాలేజీలో వున్నపుడు నేనో పాటకి మొదటి బహుమతి గెల్చుకున్నాను లైట్ మ్యూజిక్‌లో.

'నాకంటూ నీమదిలో కాస్త చోటు చాలదా
నాదంటూ చిరునామా నీ మనసే కాదా' అనీ- ఆ పాట ఎంతో యిష్టం నాకు. నేను వున్నా లేకపోయినా నీ మనసులో నా స్థానం పదిలంగా వుండాలి.

నువ్వు నీ పాదాల దగ్గర చోటిచ్చినాసరే- ఎందుకంటే నువ్వు చోటు ఎక్కడిచ్చినా- నువ్వు నావాడివి కాబట్టి.

తన్మయిని బాగా చదివించాలని, ఏ లోటూ అది ఫీల్ అవకూడదని ఎన్ని త్యాగాలు చేశాం. నాకంటే ఎక్కువగా నువ్వే. నీకు ప్రాణంతో సమానమైన సిగరెట్లను మానేసి ఆ ఖర్చుని తన్మయి ట్యూషన్ ఫీజుకి ఎడ్జెస్ట్ చేశావు. నీ ప్రేమ మాధుర్యాన్ని అణువణువునా అనుభవిస్తూ గడిపాను. కానీ, నాకు తృప్తి లేదు. ఇంకా నీతో మరో వెయ్యి సంవత్సరాలు గడపాలని వుంది. నా ఆశ మరీ అతిగా వుంది కదూ! నాకింత అత్యాశ వుంది కనుకే దేవుడు వచ్చెయ్యమంటూ యిన్విటేషన్ పంపాడు. వెళ్లకపోతే బాగుండదు కదూ! బాగుండటమేముంది! వెళ్లక తప్పదు కదా! కాకపోతే నిన్ను వదిలి వెళ్లటమొక్కటే విషాదం.




సరే, అంతా మర్చిపో కృష్ణా! నిన్ను పేరుతో పిలిచి ఎన్నాళ్లయిపోయిందో! తన్మయి ఎలా వుంది. సాగర్ క్షేమమా? పాప అన్నప్రాసనకి రాలేదని తన్మయికి కోపం వచ్చి వుంటుంది. నామీద అలిగిందా? నాకు తెలుసు. ఎలాగో సర్ది చెప్పండి.

''మీ అమ్మకి కొంచెం జ్వరంగా వుంది. అందుకే రాలేకపోయింది'' అని చెప్పండి. అంతేకానీ మీ దుఃఖాన్ని పంచుకోడానికి, మీ భారాన్ని దించుకోవటానికి ''మీ అమ్మకి కాన్సర్! మూడు నెలలకు మించి బ్రతకదు'' అని దానితో చెప్పకండి. నామీద ఒట్టే! అదసలే పిచ్చిది. దానికి అమ్మన్నా, నాన్నన్నా పిచ్చి ప్రేమ. సాగర్ కూడా అంతే.

ఇప్పుడు హడావుడి పడి సూపర్ స్పెషాలిటీ హాస్పటల్, అదీ యిదీ అని పిచ్చిగా ఖర్చుపెడతారు. వాళ్లు చిన్నపిల్లలు. కొత్తగా పెళ్లయినవాళ్లు. ముందు ముందు ఎంతో పైకి రావలసినవాళ్లు. వాళ్లిలా డబ్బు ఖర్చుపెట్టడం నాకిష్టంలేదు.

అయినా డబ్బు ఖర్చయినా లాభం లేని స్థితికి వచ్చాక యింకేం ప్రయోజనం. రెండు నెలల క్రితం దాకా మీకు చెప్పకుండా దాచటం నా తప్పే! క్షమించండి. ఈ అరవయ్యేళ్ల వయసులో- అన్నీ చవిచూశాను. ముఖ్యంగా నీ ప్రేమ. ఇంకేమీ వద్దు.

కృష్ణా, నువ్వు త్వరగా వచ్చెయ్యి. ఇందాక పక్కింటావిడ ''కృష్ణారావుగారు ఊరెళ్లి నాల్రోజులు అవలేదూ'' అంది. నాకెందుకో గుండె ఝల్లుమంది. మీరు లేకుండానే నేను చచ్చిపోతానేమో! కానీ నాకంత ధైర్యం వుందా! త్వరగా వచ్చెయ్యండి. మీరు నా కళ్లెదురుగా వుంటేచాలు అనిపిస్తోంది.

ఇదంతా ఉత్తరంగా రాయాలని అనుకున్నాను. కాని మన జ్ఞాపకాలన్నీ తవ్వి పోసి నిన్ను బాధపెట్టడం నాకిష్టంలేదు. అందుకే నా డైరీలో రాస్తున్నాను నీ సాన్నిహిత్యాన్ని ఊహించుకోడానికి. చూడండి- పిచ్చి కన్నీళ్లు- ఎలా వస్తున్నాయో! నేను లేనప్పుడు నా జ్ఞాపకాలే మీ నేస్తాలవుతాయి కదా! అప్పుడు చదవండి.

మీకోసం కళ్లలో దీపాలు వెలిగించి, గుండె నిండా మిమ్మల్ని నింపుకొని వేచి చూస్తూ వుంటాను! త్వరగా వచ్చేస్తారు కదూ!